సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 14 । జూన్ । 2025



రక్తదాత.. జీవన ప్రదాత
గాయపడ్డవారికి, శస్త్ర చికిత్సలకు రక్తం అవసరమయ్యే వారికి రెడ్‌క్రాస్ సాయపడుతోంది. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. 8లో ▸



యథేచ్ఛగా మట్టి అమ్మకాలు
నూజివీడు నియోజకవర్గంలో మట్టిదందా యథేచ్ఛగా సాగుతోంది. అధికార పార్టీ నాయకులు పగలు, రాత్రి లేకుండా చెరువుల్లోని మట్టిని కొల్లగొడుతున్నారు. 8లో ▸



రథోత్సవాలకు ఏర్పాట్లు
శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథస్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి రథోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలో వేట



నరసాపురం: సముద్రంలో వేట నిషేధకాలం గడువు నేటి అర్ధరాత్రితో ముగుస్తుంది. 61 రోజులు పాటు ఖాళీగా ఉన్న గంగపుత్రులు మళ్లీ వేటకు సముద్రంలోకి వెళ్లనున్నారు. గత ఏడాది తరచూ తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తులతో వేట సవ్యంగా సాగలేదు. సీజన్‌లో కూడా తీరానికి బోట్లు చేర్చడంతో ఏడాది పొడవునా నష్టాలే చవిచూశారు. ఈ ఏడాదైనా ప్రకృతి కరుణించాలని ఏడాది కాలమంతా వేట ముమ్మరంగా సాగాలని గంగమ్మను వేడుకుంటున్నారు మత్స్యకారులు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తుంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకూ అమల్లో ఉంటుంది.

రైల్వేలో రాయితీ కొనసాగించాలి



భీమవరం హెడ్ పోస్టాఫీసులో పోస్ట్‌కార్డులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: సీనియర్ సిటిజెన్స్‌కు రైల్వేలో రాయితీలు పునరుద్ధరించాలని కోరుతూ భీమవరం సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానమంత్రికి పోస్టుకార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లం వెంకట కృష్ణనాగేశ్వరరావు, బోనం పాండురంగారావు చేతుల మీదుగా హెడ్ పోస్టాఫీసులో సుమారు 500 పోస్ట్‌కార్డులు అందచేశారు. కోవిడ్ ముందు వరకు కేంద్ర ప్రభుత్వం రైల్వే ఛార్జీలలో మహిళలకు 50 శాతం, పురుషులకు 40 శాతం రాయితీ ఇచ్చేవారన్నారు. కోవిడ్ కారణంగా రాయితీ నిలిపివేసి నేటికీ పునరుద్ధరించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సుప్రీం తీర్పు కూటమికి చెంపపెట్టు



ముదునూరి మురళీకృష్ణంరాజు

భీమవరం: సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు కేసు బెయిల్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదని వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ముందు కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగ వేధింపులు చెల్లవనే విషయం కొమ్మినేనిపై అక్రమకేసు విషయంలో తేటతెల్లమైందని సుప్రీంకోర్టు నిర్ణయం రెడ్‌బుక్ రాజ్యాంగానికి చెంపపెట్టు వంటిదన్నారు. కూటమి పార్టీల నాయకులు మీడియా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తూ వాక్ స్వాతంత్రానికి భంగం కలిగిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని మురళీకృష్ణంరాజు కోరారు.

తల్లికి వందనంలో కోత సిగ్గుచేటు



భీమవరంలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భీమవరం: నిబంధనల పేరుతో తల్లికి వందనం పథకంలో కోత విధించటం సిగ్గు చేటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్ విమర్శించారు. శుక్రవారం భీమవరంలో తల్లికి వందనం పథకంపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. గణేష్, ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు నేడు పాఠశాల అభివృద్ధి పేరుతో రూ.2 వేలు కోతపెట్టడం దుర్మార్గమన్నారు. గత ఏడాదికి తల్లికి వందనం చెల్లించని ప్రభుత్వం ఇప్పుడు ఇస్తున్న సొమ్ములో కోత పెట్టడం నాయకుల కుటిలయత్నానికి నిదర్శనమన్నారు. కొంతమందికి సాంకేతిక సమస్యలంటూ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు. ఎలాంటి షరతులు లేకుండా పథకాన్ని వర్తింపచేసి రూ.15 వేలు ఇవ్వాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామన్నారు.

కొల్లేరుపై అధ్యయనానికి కేంద్ర కమిటీ

- వినతులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న కొల్లేరు ప్రజలు
- ఈ నెల 17, 18లో కొల్లేరు గ్రామాల్లో పర్యటన

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొల్లేరులో కేంద్ర సాధికారిత కమిటీ (సీఈసీ) బృంద పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఐదుగురు సభ్యులతో కూడిన బృందం ఈ నెల 16న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై కొల్లేరు అంశాలపై చర్చిస్తారు. అనంతరం ఈ నెల 17, 18 తేదీల్లో ఏలూరు జిల్లాలో కొల్లేరు పరీవాహక ప్రాంతాల ప్రజలతో సమావేశమవుతారు. పూర్వం కొల్లేరు ప్రజల స్థితిగతుల అధ్యయనంపై సుప్రీంకోర్టు నియమించిన అజీజ్, రామన్ సుకుమారన్ కమిటీలు నివేదికలు అందించాయి. తాజాగా మరోసారి సీఈసీ కమిటీ రానుండటంతో కొల్లేరు పరివాహక గ్రామాల్లో ఉత్కంఠ నెలకొంది. కొల్లేరు అభయారణ్యంపై 2006 ఏప్రిల్ 10న జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వాధికారులు ఉల్లంఘిస్తున్నారని, దీన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించాలని కాకినాడకు చెందిన పర్యావరణవేత్త మృత్యుంజయరావు సుప్రీంలో పిటిషన్ వేశారు. సీఎస్‌ను ప్రతివాదిగా చేర్చారు. దీంతో ఈ ఏడాది జనవరి 16న జస్టిస్ బీఆర్.గవాయి(ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి), జస్టిస్ అగస్టీ జార్జ్ మసీహ్, జస్టిస్ కె.వినోద్ చంద్రకాంత్‌లు కొల్లేరులో ఆక్రమణలు తొలగించి మూడు నెలల్లో సరిహద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. అనంతరం రాష్ట్ర చేపల రైతు సంఘం తరుపున జీ రాయితీ రైతులు రిట్ పిటిషన్ వేశారు. దీంతో కోర్టు కొంత గడువునిస్తూ సీఈసీ కొల్లేరులో పర్యటించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఈసీ సభ్యులు కొల్లేరులో పర్యటించనున్నారు.

20 వేల ఎకరాలను మినహాయించాలి

కొల్లేరు అభయారణ్యం 77,138 ఎకరాలుగా జీవో 120 ప్రకారం నిర్ణయించారు. కొల్లేరు సరస్సు చుట్టూ 122 గ్రామాల్లో 3 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. సుప్రీం ఆదేశాలతో 2006లో జరిగిన కొల్లేరు ఆపరేషన్‌లో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 31,125 ఎకరాలలో అక్రమిత చేపల చెరువులను ధ్వంసం చేశారు. వీటిలో పట్టా భూములు 14,932 ఎకరాలు, బీఫాం భూములు 5,510 ఎకరాలు ఉన్నాయి. కొల్లేరు పరిధి నుంచి పట్టా, బీఫాం భూములు మినహాయించి, కొత్త సరిహద్దులు నిర్ణయించాలంటూ జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డు(ఎన్‌బీడబ్ల్యూఎల్) 2018లోనే ఆదేశాలిచ్చింది. దీనిని అమలు చేయాలని కోరనున్నారు.

వినతులతో కొల్లేరు ప్రజలు సిద్ధం


కేంద్ర సాధికారిత కమిటీ(సీఈసీ)కి కొల్లేరు గ్రామాల ప్రజలు వినతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఇటీవల ఈ విషయంపై కొల్లేరు పెద్దలు కీలక సమావేశాలు నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి కొల్లేరు జీ రాయితీ, బీఫాం పట్టా వివరాలతో పాటు గ్రామంలో మౌలిక వసతులైన తాగునీటి చెరువులు, ఇంటి స్థలాల పంపిణీ, రహదారుల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని పంచాయతీ సర్పంచ్ తీర్మానాలు అందించాలని నిర్ణయించారు. ఇందు కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు.

పంచాయతీలకు మొండిచేయి

గ్రామాభ్యుదయానికి బాటలు వేస్తామంటూ ఎన్నికల ముందు చెప్పిన కూటమి పెద్దలు అందుకు భిన్నంగా పాలన సాగిస్తున్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం మంజూరు చేసిన నిధులను పంచాయతీలకు ఇవ్వకుండా పల్లె ప్రగతికి ఆటంకం కలిగిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు దాదాపు రూ.25.59 కోట్లు నెలల తరబడి రాష్ట్ర ప్రభుత్వం వద్దనే మూలుగుతున్నాయి.

- కూటమి సర్కారు నిర్వాకం
- జమకాని 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు
- రెండు నెలల క్రితమే రూ.25.59 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

పాలకోడేరు మండలం మోగల్లు ప్రజలకు రక్షిత నీటిని అందించేందుకు గత ప్రభుత్వంలో అదనపు ఫిల్టర్‌బెడ్ నిర్మాణం చేపట్టారు. మిగిలిఉన్న పంప్ హౌస్ పనులు పూర్తిచేసేందుకు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా. 15వ ఆర్థిక సంఘం నిధులతో పంప్‌హౌస్ నిర్మించే యోచనలో అధికారులున్నారు. మరో రెండు చెరువుల వద్ద ఫిల్టర్ బెడ్ల మరమ్మతులతో పాటు, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం నిమిత్తం ఈ నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పనులు ముందుకు సాగడం లేదు.



మోగల్లులో అసంపూర్తిగా నిలిచిపోయిన ఫిల్టర్ బెడ్

సాక్షి, భీమవరం: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు జనాభా ప్రాతిపదికన కేంద్రం ఏటా ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తుంది. ఏడాదిలో రెండు విడతలుగా ఈ నిధులను జమచేస్తుంది. టైడ్, బేసిక్ గ్రాంట్ల రూపంలో విడుదల చేసే ఈ నిధులను ఆర్థిక సంఘం మార్గదర్శకాల మేరకు స్థానిక సంస్థలు వినియోగించాలి. బేసిక్ గ్రాంట్‌ను గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, వీధిలైట్ల నిర్వహణ తదితర పనులకు వెచ్చించాలి. టైడ్ గ్రాంట్‌ను పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఓడీఎఫ్ అమలు తదితర ప్రాథమిక అవసరాలకు వెచ్చించాలి. కేంద్రం నుంచి ఈ నిధులు తొలుత రాష్ట్ర ప్రభుత్వానికి చేరుతాయి. అక్కడి నుంచి రాష్ట్రప్రభుత్వం ఆర్థిక సంఘం కేటాయింపుల మేరకు పంచాయతీలకు జమచేస్తుంది.

నెలలు గడుస్తున్నా జమ చేయరే?

జిల్లాలో 20 మండలాల పరిధిలో 409 గ్రామ పంచాయతీలున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నుంచి దాదాపు రూ.50 కోట్లు కేంద్రం కేటాయింపులు చేసింది. తొలి విడతగా రూ. 24.41 కోట్లు గతేడాది అక్టోబరులో పంచాయతీలకు చేరాయి. ఈ ఏడాది ప్రారంభంలో రెండో విడత టైడ్, బేసిక్ నిధులు దాదాపు రూ. 25.59 కోట్లను 15వ ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాలకు విడుదల చేసింది. ప్రభుత్వం వాటిని పంచాయతీ ఖాతాలకు జమచేయాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసిపోయినా నెలల తరబడి ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా కాలయాపన చేస్తోంది.

పడకేసిన ప్రగతి

నిధుల విడుదలలో జాప్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. ఇంటి పన్నులపై వచ్చే ఆదాయం సిబ్బంది జీతభత్యాలు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణకు చాలని పరిస్థితి. సీసీ రోడ్లు పనులు జరుగక మట్టి రోడ్లపైనే గ్రామీణ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. నిధుల కొరతతో వీధి దీపాలు వెలగడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు నిధుల కొరత వేధిస్తోందని సర్పంచులు వాపోతున్నారు. ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడు వస్తాయని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. రెండో విడత నిధులు విడుదల కావాల్సి ఉందని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు.

గ్రామాభ్యుదయం కోసం ఎన్నో చేస్తామంటూ ఎన్నికల ముందు ఉపన్యాసాలు ఇచ్చిన నేతలు ఇప్పుడు నిధులను దారి మళ్లిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. త్వరితగతిన పంచాయతీలకు ఆర్థిక సంస్థ నిధుల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండలాలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు

మండలం	మొత్తం (రూ.కోట్లలో)	మండలం	మొత్తం (రూ.కోట్లలో)
ఆచంట	1.23	పాలకోడేరు	1.21
ఆకివీడు	0.37	పాలకొల్లు	0.74
అత్తిలి	1.36	పెంటపాడు	1.09
భీమవరం	1.17	పెనుగొండ	1.39
యలమంచిలి	1.30	పెనుమంట్ర	1.22
గణపవరం	1.20	పోడూరు	1.33
ఇరగవరం	1.32	తాడేపల్లిగూడెం	1.45
కాళ్ల	1.31	తణుకు	1.00
మొగల్తూరు	1.45	ఉండి	1.22
నరసాపురం	1.62	వీరవాసరం	1.31

డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు



ఫిర్యాదులను విచారిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్టీఆర్ వైద్య సేవ ఉచిత చికిత్సలకు ఆస్పత్రులు డబ్బులు వసూలు చేస్తే పెద్ద మొత్తంలో అపరాధ రుసుంతో పాటు, కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఎన్టీఆర్ వైద్య సేవలకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై 17 ఆస్పత్రులపై వచ్చిన ఫిర్యాదులను విచారించారు. లేని జబ్బులను ఉన్నట్టుగా చూపించి వైద్యం చేయడమేనా మీ పని.. అని తప్పుపట్టారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడుతారా? అని ప్రశ్నించారు. పుట్టిన పిల్లలకు కామెర్లు లేకుండానే, కామెర్ల పేరిట ఫోటోథెరపీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని తప్పుపట్టారు. ప్రజల ఆలోచన ధోరణిలో మార్పు రావాలని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులతో కూడిన ప్రసూతి సేవలను ఉచితంగా అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక ఆసుపత్రి డెంగ్యూ పేరిట వైద్యంచేసి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు శాంపిల్స్ సేకరించగా.. డెంగ్యూ కాదని స్పష్టం కావడంతో ఎందుకు ఇలా చేయాల్సి వచ్చిందని సంబంధిత హాస్పిటల్ డాక్టర్‌ను గట్టిగా నిలదీశారు. డెంగ్యూ పేరిట వసూలు చేసిన మొత్తానికి మూడు రెట్లు కలిపి అపరాధ రుసుంగా వసూలు చేయాలని ఆదేశించారు. అదే ఆసుపత్రి ఇంకో కేసు విషయంలో రూ.80 వేలు వసూలు చేసినందుకు రెట్టింపు కలిపి అపరాధ రుసుంగా వసూలు చేయాలని ఆదేశించారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది నిరసన



తణుకులో నిరసన తెలుపుతున్న జేఏసీ సభ్యులు



నరసాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై ఆందోళన

నరసాపురం/తణుకు అర్బన్: ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి జేఏసీ పిలుపులో మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేవారు. మోకాళ్లపై నిల్చుని ఆందోళన చేశారు. రెగ్యులరైజ్ చేయాలని, హెచ్ఆర్‌సీ పాలసీ అమలు చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో తణుకు మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ జీవో 36ను అవుట్‌సోర్సింగ్ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల్లో నగర అభివృద్ధి కోసం గుత్తేదారులకు చెల్లిస్తున్న ఎస్ఎస్ఆర్ రేట్లను అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా అమలుచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. చనిపోయిన, రిటైర్ అయిన కార్మికుల వారసులకు ఉపాధి కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు పాపారావు, విజయ్‌కుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సహకార అధికారిగా మురళీకృష్ణ



మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

భీమవరం: జిల్లా సహకార అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సంకు మురళీకృష్ణకు శుక్రవారం రాష్ట్ర సహకార సంఘ ఉద్యోగుల ఫెడరేషన్ కార్యదర్శి నందమూరి సుబ్బారావు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ నుంచి బదిలీపై వచ్చిన మురళీకృష్ణను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం భీమవరంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో జరిగిన అవకతవకలను మురళీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: విద్యుత్ లైన్ల అనుసంధానం నేపథ్యంలో శని, ఆదివారాల్లో జిల్లాలోని పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ ఆలపాటి రఘునాథబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు పట్టణాలతో పాటు భీమవరం, వీరవాసరం, ఉండి, కాళ్ళ ఆకివీడు, పాలకోడేరు, నర్సాపురం, పాలకొల్లు, మొగల్తూరు, యలమంచిలి, పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ, తణుకు, అత్తిలి, ఇరగవరం, గణపవరం మండలాలకు విద్యుత్ సరఫరా శని, ఆదివారాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

ఏలూరులో వేగ జ్యూయలర్స్ ప్రారంభం



వేగ జ్యూయలరీ షోరూం ప్రారంభిస్తున్న సినీ నటులు బాలకృష్ణ, సంయుక్త మీనన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రజలకు మంచి డిజైన్ ఆభరణాలు అందించాలనే లక్ష్యంతో తమ షోరూం ఏలూరులో ప్రారంభించామని వేగ జ్యూయలర్స్ చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్ అన్నారు. శుక్రవారం ఎన్ఆర్‌పేటలో వేగ జ్యూయలర్స్ ప్రారంభోత్సవంలో సినీ నటులు నందమూరి బాలకృష్ణ, సంయుక్త మీనన్ పాల్గొన్నారు. ఇది 5వ షోరూం అని.. ఖాతాదారుల నమ్మకానికి కట్టుబడి వ్యాపారం సాగిస్తున్నామన్నారు. షోరూం ప్రారంభం సందర్భంగా ప్రతి రూ.లక్ష కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం, పాత బంగారం మార్పిడిపై గ్రాముకు రూ.100 అదనంగా చెల్లించడానికి ఏర్పాటు చేశామన్నారు. డైమండ్ ధర క్యారట్ రూ.51,999 మాత్రమేనని తెలిపారు. లక్కీ డ్రా నిర్వహించి అయిదుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్‌లు బహుమతిగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ వనమా నవీన్ కుమార్, డైరక్టర్లు వనమా సుధాకర్, చంద్రకాంత్, చిట్లూరు నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ జోలికొస్తే ఊరుకోం

అత్తిలి: ఉపాధి హామీ జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చినవీరభద్ర రావు హెచ్చరించారు. కొమ్మరలో కూలీలు పనిచేస్తున్న ప్రాంతాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కూలీల ఆర్థిక పరిస్థితి మరింత దుర్భరంగా మారిందన్నారు.

జోరుగా విద్యా వ్యాపారం

నారాయణలో పుస్తకాల అమ్మకం అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ



నారాయణ స్కూల్‌లో పుస్తకాలు నిల్వచేసిన దృశ్యం



పుస్తకాలు ఉంచిన గదిని సీజ్ చేసిన దృశ్యం(ఫైల్)

భీమవరం: జిల్లా కేంద్రమైన భీమవరంలో విద్యా వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రైవేటు విద్యా సంస్థల్లో అక్రమంగా ప్రవేశాలు కల్పిస్తూ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే ప్రవేశాలు ప్రారంభించగా, స్కూళ్లు తెరవడంతో పుస్తకాలు, యూనిఫాం వంటి విద్యా సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. కళ్లెదుటే ఇంత జరుగుతున్నా విద్యా శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేక ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వేసవి సెలవుల్లో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించగా ప్రభుత్వం ప్రకటించిన తేదీ కంటే ముందుగానే తరగతులు ప్రారంభించారు. అనేక ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం వంటి విద్యా సామగ్రి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. విద్యాసంస్థల వద్దనే ప్రత్యేక గదుల్లో పుస్తకాలు, సామాగ్రి నిల్వచేసి అమ్ముతున్నారు. ఈ నెలలోనే భీమవరం పట్టణంలోని నారాయణ, చైతన్య స్కూళ్లలో పుస్తకాలు విక్రయిస్తుండగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దాడిచేసి విక్రయాలు అడ్డుకున్నారు. విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేయడంతో నారాయణ స్కూల్ గదిని డీవైఈవో రమేష్ సీజ్ చేశారు. స్కూల్ నిర్వాహకులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నారాయణ, చైతన్య గుర్తింపు రద్దు చేయాలి

నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న నారాయణ, చైతన్య స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యా సంస్థలు భారీగా ఫీజులు వసూలు చేయడమేగాక పుస్తకాలు, మిగిలిన విద్యాసామాగ్రిని అధిక ధరలకు విక్రయిస్తూ.. విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు నిద్రమత్తు వీడి పుస్తకాల విక్రయాలు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రక్తదాత.. జీవన ప్రదాత

- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం
- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగుల రక్తదానం


రాయలంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో రక్తదానం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు (ఫైల్)

భీమవరం అర్బన్: ప్రమాద సమయాల్లో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన వారికి రక్తం చాలా అవసరం. ఇలా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రెడ్‌క్రాస్ చొరవతో రక్తం అందుతుంది. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారికే కాకుండా తలసేమియా రోగులకు, ఇతర శస్త్రచికిత్సల్లో రక్తం అవసరమయ్యే వారికి రెడ్‌క్రాస్ రక్తనిధి దన్నుగా నిలుస్తుంది. నోబుల్ బహుమతి గ్రహీతైన ఆస్ట్రేలియాకు చెందిన కార్ల ల్యాండ్ స్టైనర్ జయంతి, జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

దాతల అవసరం లేకుండానే

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బ్లడ్ బ్యాంకులు రక్తాన్ని అమ్మకూడదు. దాత నుంచి సేకరించాక మరొకరి శరీరంలోకి ఎక్కించేందుకు సురక్షితమో? కాదో నిర్ధారించే పరీక్షలు, భద్రపరిచేందుకు అవసమైన ప్రాసెసింగ్ చార్జీలు మాత్రమే తీసుకోవాలి. ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో దాతలు రక్తాన్ని ఇచ్చిన తరువాత రోగికి కావాల్సిన బ్లడ్ గ్రూపుల రక్తాన్ని విక్రయిస్తారు. రెడ్‌క్రాస్ సొసైటీలో దాత అవసరం లేకుండా రోగికి కావాల్సిన బ్లడ్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ప్రాసెసింగ్ చార్జీలతో అందజేస్తారు.

ముందుకు వచ్చిన ఉద్యోగులు

ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారాల్లో మండలంలోని రాయలంలో ఏర్పాటు రెడ్‌క్రాస్ సొసైటీలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందితో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 12 శిబిరాల ద్వారా 645 యూనిట్లు రక్తాన్ని సేకరించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ బద్రిరాజు తెలిపారు. రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు.

రక్తదానంతో ప్రాణాలకు రక్షణ

ఒక వ్యక్తి చేసే రక్తదానం 4 ప్రాణాలు కాపాడుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. రక్తం ఇవ్వగానే దానిని వివిధ భాగాలుగా విభజిస్తారు. దాత నుంచి సేకరించే రక్తాన్ని హోల్ బ్లడ్ అంటారు. ఆ రక్తంలో ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, తెల్ల రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు ఉంటాయి. వీటిని విడదీసి నలుగురికి ఈ రక్తాన్ని ఎక్కించవచ్చు. ఒక వ్యక్తి ప్రతి 3 నెలలకు ఒకసారి సాధారణ రక్తదానం చేయవచ్చు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్లేట్‌లెట్స్ కానీ, ప్లాస్మాను గానీ దానం చేయవచ్చు. రక్తదానం చేయడానికి ముందు రక్తదాత హెల్త్ ప్రొఫైల్ తెలుసుకోవచ్చు. రక్తదానం చేయడం వల్ల పెద్దపేగు, ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు, క్యాన్సర్లు వంటి రాకపోవడమే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు తగ్గుతాయి.

రక్తదానం ఎవరు చేయాలంటే?

18–60 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి బరువు 45 కిలోల పైన ఉండాలి. బీపీ అదుపులో ఉండాలి. తీవ్రమైన వ్యాధులు, మూర్ఛ, మూత్రపిండ వ్యాధులు, అలర్జీ, అసాధారణ రక్తస్రావ లక్షణాలు, హృదయ సంబంధమైన వ్యాధులు ఉండకూడని వారు రక్తదానం చేయవచ్చు. అలాగూ హిమోగ్లోబిన్ 100 మిల్లీ లీటర్ల రక్తంలో 12.5 గ్రాముల కంటే ఎక్కువగా ఉండాలి.

రక్తదానం ఎవరు చేయకూడదంటే?

గర్భిణులు, ప్రసవానంతరం 6 నెలల వరకు బిడ్డకు పాలిచ్చినంత కాలం, బహిష్టు సమయంలో అధికంగా రక్తస్రావం జరిగే పరిస్థితుల్లో స్త్రీలు రక్తం ఇవ్వకూడదు. అలాగే టీకాలు వేసుకున్న రెండు వారాల లోపు ఇవ్వకూడదు. జంతువుల కాట్లకు గురైన ఏడాది లోపు ఇవ్వకూడదు. టిటానస్ (ధనుర్వాతం), డిఫ్తీరియా (కంఠవాపు), గ్యాస్ గ్యాంగ్రీన్ కోసం మందులు వాడినవారు పచ్చకామెర్లు వ్యాధి గ్రస్తులు కూడా రక్తం ఇవ్వకూడదు.

రాయలంలో అత్యాధునిక బ్లడ్ బ్యాంక్



నూతన జిల్లా ఏర్పడ్డాక 2022లో అప్పటి కలెక్టర్ పి.ప్రశాంతి నేషనల్ రెడ్ క్రాస్ ద్వారా రూ. కోటి 50 లక్షలతో అత్యాధునిక పరికరాలను మంజూరు చేయించారు. అలాగే మండలంలోని రాయలం పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ భవనాన్ని బ్లడ్ బ్యాంకు కోసం కేటాయించారు. ఉద్యోగులు, ప్రజల నుంచి జిల్లా శాఖ కోటి రూపాయల మేర విరాళాలు సేకరించి భవనంలో వైద్య పరికరాలు మార్పులు చేయించి వసతులు కల్పించారు. గతేడాది నవంబర్ 18న జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, ప్రస్తుత కలెక్టర్ సీహెచ్ నాగరాణి బ్లడ్ బ్యాంకును ప్రారంభించారు. అయితే తణుకు, నరసాపురంలోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులు హోల్ బ్లడ్‌ను మాత్రమే అందిస్తాయి. రాయంలోని ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో అత్యాధునిక పరికరాలు ద్వారా రక్తాన్ని ప్రాసెసింగ్ చేసి హోల్ బ్లడ్‌తో పాటు ఎర్రరక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ అందించే విధంగా ఆధునిక వసతులు కల్పించారు. 8 వేల యూనిట్లు రక్తం నిల్వ ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల చొరవ అభినందనీయం



రక్తదాన శిబిరాలకు ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయం. వారు రక్తదానం చేయడంతోనే 645 యూనిట్ల రక్తాన్ని సేకరించగలిగాం. ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని ఎంతోమందిని రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా కాపాడగలిగాం. రక్తం కొరతను తీర్చడం, అత్యవసర పరిస్థితులు, శస్త్ర చికిత్సల సమయంలో ప్రాణాలను రక్షించే సహాయాన్ని అందించడం లక్ష్యంగా ఈ కేంద్రం పనిచేస్తుంది.

– డాక్టర్ బద్రిరాజు, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్, భీమవరం

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీ డీన్ స్టూడెంట్ వేల్ఫేర్ అధికారిగా ఎల్.రాజేష్


రాజేష్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్

నూజివీడు : స్థానిక ట్రిపుల్ ఐటీ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ (బాలురు) అధికారిగా ఇంగ్లిష్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎల్.రాజేష్ శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పాటు ఈ పదవిని ఆయన నిర్వర్తించనున్నారు. అలాగే చీఫ్ వార్డెన్ (బాలురు)గా బి.సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈయన పీయూసీలో బయాలజీ మెంటార్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో తగిన చొరవ చూపాలని రాజేష్‌కు సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ డీన్ దువ్వూరి శ్రావణి, సెంట్రల్ ఏఓ బండి ప్రసాద్, ఏఓ బి లక్ష్మణరావు, డీన్ సాధు చిరంజీవి, చీఫ్ వార్డెన్ బి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో రాయిపై పడి వ్యక్తి మృతి


లక్ష్మీకాంత్ మృతదేహం

కాళ్ల: మద్యం మత్తులో రోడ్డు పక్కన ఉన్న రాయిపై పడిపోవడంతో తీవ్ర గాయమై ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద అమిరంలోని లిబర్టీ ఫ్యాక్టరీ సమీపంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మీకాంత్ (34) భీమవరం పట్టణంలోని బాలాజీ మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. అతనికి వివాహమై ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మద్యానికి బానిసైన లక్ష్మీకాంత్ గురువారం రాత్రి మద్యం సేవించి వస్తూ రోడ్డు పక్కన రాయిపై పడిపోవడంతో కనుబొమ్మ వద్ద గాయమై ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారంతో భీమవరం డీఎస్పీ జయసూర్య, ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, ఎస్సైలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి మదనాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించడానికి ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ డైరెక్టర్ ఎం.ఫణి కిషోర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సులో 30 రోజులు, సీసీ కెమెరాల బిగింపుపై 13 రోజుల శిక్షణ ఉంటుందని వివరించారు. ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సుకు 10వ తరగతి ఆపై, సీసీ కెమెరాల బిగింపు కోర్సుకు 5వ తరగతి ఆపై విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరడానికి గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగులు అర్హులని తెలిపారు. శిక్షణ తరగతులు ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాలకు 99485 65256, 90140 40780 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు


నూజివీడు : బోర్వంచ శివారు కొన్నంగుంట గోరింత చెరువులో మట్టి తవ్వకాలు


ముసునూరు : గోపవరంలో చెరువుల నుంచి ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్న దృశ్యం

నూజివీడు: నియోజకవర్గవ్యాప్తంగా మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మట్టిదోపిడీ కోసమే కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్న చందంగా అధికార పార్టీకి చెందిన నాయకులు పగలు, రాత్రి లేకుండా చెరువుల్లోని మట్టిని కొల్లగొడుతున్నారు. అధికారుల పర్యవేక్షణలోపంతో ధనార్జనే ధ్యేయంగా సహజ సంపదైన మట్టిని కొల్లగొడుతూ లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారు. నూజివీడు డివిజన్‌కు సబ్‌కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో మట్టి దందా ఊపందుకుంది. మండలంలోని బోర్వంచ శివారు కొన్నంగుంట గోరింత చెరువు నుంచి మట్టి అక్రమ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ చెరువులో గ్రావెల్ పెద్ద ఎత్తున ఉండడంతో గ్రామంలోని పొలాల్లోకి సారవంతమైన పూడిక మట్టిని తోలుకునేందుకు అనుమతులు పొంది గ్రావెల్‌ను తవ్వి నూజివీడు పట్టణంలోనికి ట్రాక్టర్లలో యథేచ్ఛగా తరలిస్తూ మట్టిని విక్రయిస్తున్నారు. ట్రక్కు వెయ్యి రూపాయల నుంచి రూ.1200లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ చెరువులో 2014–19 సమయంలో తవ్విన అడ్డగోలు తవ్వకాలతో తూము కంటే పది అడుగుల లోతుకు చేరినా ఇరిగేషన్ అధికారులు మాత్రం మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వడంపై గ్రామానికి చెందిన పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధురాలు మృతి చెందినా ఆగని రవాణా

ముసునూరు: మండలంలోని గోపవరం, రమణక్కపేట, కొర్లగుంట,లోపూడి తదితర గ్రామాల్లో జేసీబీలు పెట్టి, రేయింబవళ్లు తేడా లేకుండా వందలాది ట్రాక్టర్లతో విలువైన చెరువు మట్టి తరలిస్తున్నారు.గోపవరంలో టీడీపీ నేతలే ట్రాక్టర్ ట్రక్కు మట్టికి రూ.650 నుంచి రూ.700 గా నిర్ణయించి, మట్టిని యథేచ్ఛగా అమ్ముకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల గోపవరంలో మట్టి ట్రాక్టర్ ఢీకొట్టి వృద్ధురాలు మృతి చెందినా ఆగకుండా అక్రమ మట్టి రవాణా కొనసాగిస్తున్నారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న సమాచార, గృహనిర్మాణ శాఖా మంత్రి పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే అక్రమ మట్టి రవాణాపై తహసీల్దార్ కేవీ రమణను వివరణ కోరగా తక్షణమే సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నీటిపారుదల శాఖ నూజివీడు డీఈఈ అర్జునరావును సంప్రదించగా అన్ని గ్రామాల్లో తోలకాలకు అనుమతులు ఇవ్వలేదని, అనుమతి లేకుండా మట్టి రవాణా చేసేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భద్రాచలానికి ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీఎస్ఆర్టీసీ భీమవరం నుంచి భద్రాచలం కొత్త సర్వీసును ఏలూరు కొత్త బస్టాండులో శుక్రవారం ఆర్టీసీ విజయవాడ జోన్ 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ భద్రాచలానికి భీమవరం డిపో నుండి గతంలోనే ఒక బస్సు సర్వీసు తిరిగేదని, ప్రస్తుతం రాత్రివేళ సర్వీసుగా ఈ బస్సుని ఏర్పాటు చేశామన్నారు. భీమవరం డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఈ బస్సు భీమవరంలో రాత్రి 8 గంటలకు బయలుదేరి ఏలూరు 10 గంటలకు వచ్చి భద్రాచలం తెల్లవారుజామున మూడు గంటలకు చేరుతుందని తెలిపారు. తిరిగి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు బయలుదేరి ఒంటి గంటకి ఏలూరు చేరుకుని మూడు గంటలకి భీమవరం చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, ఏఎంటీ జి.మురళి, ఎంఏఎఫ్ ఐ.ప్రేమ్ కుమార్, పీఆర్ఓ కేఎల్‌వీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని బంధువుల ఇంట్లో ఉరివేసుకున్న యువతి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలం చిర్రామానం గ్రామానికి చెందిన ఎస్. చందన ప్రియ (20) భీమవరంలోని మెంటేవారితోటలో ఉంటున్న మేనమామ ఇంటికి మే నెల 18న వచ్చారు. సెల్‌ఫోన్ విషయమై అల్లరి చేయవద్దని తల్లి చెప్పింది. దీంతో 29న ఉదయం మృతురాలి మేనమామ లేచి చూసేసరికి ఇంటి బయట ఉన్న రేకులషెడ్డుకు ఉరి వేసుకుని చందన ప్రియ కనిపించగానే కిందకు దించి చికిత్సకు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతి చెందింది. తన కూతరు ఓ అబ్బాయితో తరచూ ఫోన్లో మాట్లాడేదని, అతడు వేరొకర్ని వివాహం చేసుకోవడంతో బాధతో క్షణికావేశంలో ఉరి వేసుకుని మృతి చెందినట్లు మృతురాలి తల్లి రామలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ వై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

జగన్నాథుని రథోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

27 నుంచి రథోత్సవాల నిర్వహణ


లక్ష్మీపురంలో పురాతన జగన్నాథుని ఆలయం



ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల విగ్రహాలు. జగన్నాథుని రథం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథస్వామి వారి ఆలయంలో ఈ నెల 27 నుంచి వచ్చే నెల 6 వరకు జగన్నాథుని రథోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను పూరీ క్షేత్రంలో నిర్వహించే విధంగా చిన వెంకన్న దేవస్థానం ఇక్కడ వైభవంగా నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ నెల 27న రథంపై స్వామి వారు లక్ష్మీపురం ఆలయం నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి ఊరేగింపుగా వెళ్తారు. అలాగే ఉత్సవాల ముగింపు రోజు జులై 6న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి రథయాత్రగా వెళ్లనున్నారు. రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో జగన్నాథస్వామి వారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. భక్తులు స్వామి వారిని దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

దశావతారాలు ఇలా..

27న మత్స్యావతారం, 28న కూర్మావతారం, 29న వరాహావతారం, 30న నరసింహావతారం, జులై 1న వామనావతారం, 2న పరశురామావతారం, 3న రామావతారం, 4న కృష్ణావతారం, 5న కల్కిఅవతారం, 6న శ్రీవేంకటేశ్వర స్వామి అవతారం

మోటార్‌సైకిళ్ల దొంగ అరెస్ట్

రూ.13 లక్షల విలువైన మోటారు సైకిళ్లు స్వాధీనం


నిందుతుడు, చోరీ చేసిన వాహనాలతో పోలీసులు

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో రాత్రి సమయంలో మోటారుసైకిళ్లను దొంగలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం పట్టణ ఎస్సై నాగ రాజు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు పట్టణానికి చెందిన పూతి ప్రసాద్ అలియాస్ పెరుమాళ్ల దాలయ్య పలు పట్టణాల్లో రాత్రి సమయాల్లో సంచరిస్తూ ఇళ్ల ముందు ఉన్న కొత్త మోటారుసైకిళ్లను దొంగలిస్తున్నాడు. దీంతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పూతి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి రూ.13 లక్షలు విలువైన 9 మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లిగూడెం పరిధిలో నాలుగు, తణుకు టౌన్‌లో 1, రావులపాలెంలో రెండు, గుడివాడ టౌన్‌లో ఒకమోటారుసైకిల్ దొంగలించాడు. ఈ మేరకు ప్రసాద్‌పై కేసు నమోదు కోర్టుకు హాజరుపర్చనున్నారు. పూతి ప్రసాద్ గతంలో వివిధ జిల్లాల్లో సుమారు వంద నేరాలు చేసి జైలుశిక్ష అనుభవించాడు.

ఆరుతడి పద్ధతితో అధిక దిగుబడి

ఏలూరు(మెట్రో): వరిలో ఆరుతడి పద్ధతి సాగుతో అధిక దిగుబడిని సాధించవచ్చని డీపీఎం షేక్ హబీబ్ బాషా, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ బి.వెంకటేష్ తెలిపారు. ఏలూరులోని జిల్లా కళ్యాణి అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్స్‌కు అంతర్జాతీయ పరిశోధన కోర్ ప్రాజెక్ట్ గురించి డీపీఎం షేక్ హబీబ్ బాషా వివరంచారు. వరిలో ఆరుతడి పద్ధతి, హరిత గృహవాయువు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే కోర్ ప్రాజెక్టు సిబ్బంది ఈ శిక్షణలో వరిలో ఆరుతడి పద్ధతి ఏ విధంగా పాటించాలి? అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. ఆరుతడి పద్ధతి సాగు వల్ల 30 శాతం వరకు సాగు నీరు ఆదా అవుతుందన్నారు. అలాగే మెరుగైన పంట ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంయూ స్టాఫ్ శాస్త్రీయ శాస్త్రవేత్తలు అంకిత పాల్, పవన్ యెగ్గిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణకు జిల్లా అధికారులు



ఢిల్లీలో ఎన్నికల శిక్షణలో పాల్గొన్న జిల్లా అధికారులు

భీమవరం (ప్రకాశం చౌక్): భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన శిక్షణలో జిల్లా అధికారులు పాల్గొన్నార. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలోని నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవెల్ సూపర్‌వైజర్లు, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులకు 12, 13 తేదీల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల తరపున నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, జిల్లా నుంచి ఐదు మంది బీఎల్‌ఓలు, ఇద్దరు బీఎల్‌ఓ సూపర్వైజర్లు హాజరయ్యారు. అలాగే శిక్షణ కార్యక్రమంలో కొన్ని అంశాలను బోధించడానికి కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి కూడా వెళ్లారు. శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు విధులు, విధానాలు, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, యువ ఓటర్ల నమోదు, విధుల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

దైవ దర్శనానికి వెళ్లి వచ్చేసరికి చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని ఒక కుటుంబం దైవ దర్శనానికి వెళ్లి మొక్కు తీర్చుకుని వచ్చేసరికి దొంగలు ఇంటిని కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు వన్‌టౌన్ దక్షిణపువీధి ప్రాంతానికి చెందిన ఇన్నమూరి భాస్కరరావు ఇంటివద్దే కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. ఆయన తన కుటుంబంతో తిరుమల తిరుపతి దర్శనానికి ఆదివారం వెళ్లి శుక్రవారం ఇంటికి వచ్చారు. అయితే ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. చోరీ సమాచారం అందుకున్న ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, క్లూస్ టీమ్ ఘటన స్థలంలో ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

రక్తదాత నాగరాజుకు కలెక్టర్ సత్కారం



భీమవరంలో కలెక్టర్ నాగరాణి చేతులమీదుగా అవార్డు అందుకున్న నాగరాజు

తణుకు అర్బన్: గత 20 సంవత్సరాలుగా 54సార్లు రక్తదానంతోపాటు ప్లేట్లెట్స్ దానం చేసినందుకు తణుకు పట్టణానికి చెందిన బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తనకు ఈ పురస్కారం దక్కినట్లు నాగరాజు తెలిపారు. రక్తదానంపై కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులను రక్తం దానం చేసే విధంగా ప్రోత్సహించినందుకు భీమవరంలో కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం పొందినట్లు వివరించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



అత్తిలి లయన్స్ క్లబ్ భవనంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: లయన్స్ క్లబ్ ఆఫ్ అత్తిలి ఆధ్వర్యంలో తణుకు ముళ్ళపూడి మెమోరియల్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం అత్తిలిలో నిర్వహించారు. 38 మందికి సాధారణ పరీక్షలు, 30 మందికి కంటి పరీక్షలు, ముగ్గురు పిల్లలకు, ఇద్దరు గర్భిణులకు పరీక్షలు చేశారు. 6 గురికి క్యాటరాక్టు శస్త్ర చికిత్సలు చేయాలని, 14 మందికి కళ్ల జోళ్లు అవసరమని నిర్ధారించారు. డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మౌనిక, డాక్టర్ సాయి మంజు, డాక్టర్ వై వి ఎస్ ప్రసున్న, పీఆర్‌ఓ నాగరాజు సేవలు అందించారు. క్లబ్ అధ్యక్షుడు సింగులూరి చంద్రశేఖర్ ,కార్యదర్శి శీతాల వెంకట నారాయణ, బండి గంగాధర్ సంకు బాబు రావు ,యాతం రాంబాబు, శిరగాని నాగేశ్వరరావు, పట్నాల బాబు, వడ్డీ కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



అత్తిలి మండలం ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

అత్తిలి: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి కోరారు. శుక్రవారం అత్తిలి మండలం ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆట పాటలతో విద్యను అందించడమే కాకుండా పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈసందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



స్టూడెంట్ కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేట 5వ వార్డు మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌ను, మధ్యాహ్న భోజన పథకాన్ని సన్నబియ్యంతో విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను, ఉచిత సదుపాయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, మహిళా పోలీస్ స్వప్న, అనిల్ కుమార్, భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, ఉపాధ్యాయిని కె.కుమారి, ఎం.చంద్రకుమారి, అంగన్‌వాడీలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో బలుసులమ్మతల్లి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మతల్లికి శుక్రవారం సందర్భంగా ఆలయంలో విశేష పూజలు జరిగాయి. దాత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నదానంనకు సహకరించారు. ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి పర్యవేక్షించారు. పూజలలో భక్తులు పాల్గొన్నారు. అన్న ప్రసాదాలను స్వీకరించారు.

కుళాయిల నుంచి కలుషిత జలాలు

- అడుగంటిన తాగునీటి చెరువులు
- పట్టించుకోని నీటి సరఫరా అధికారులు

పెంటపాడు: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు మండలంలో కనపడుతోంది. ఇది గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. ఫలితంగా తాగునీరు లేక పలు గ్రామాల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా వేసవికి ముందే ఆర్‌డబ్ల్యూఎస్, మండల అధికారులు, కార్యదర్శులు ఎంపీడీవో అధ్యక్షతన సమావేశాలు జరిపేవారు. కాగా నేడు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అధికారులు మోహం చాటేశారు. ప్రధానంగా బి. కొండేపాడులో రెండు పెద్ద తాగునీటి చెరువులు ఉన్నాయి. కానీ ఒక్కటికూడా అక్కరకు రావడం లేదు. చెరువులలో తామరాకులు తీయక పోవడం వల్ల ఆ నీరు ఆకులు, కాడల వల్ల కుళ్లి పురుగులు వస్తున్నాయి. ఆ నీటిని యథాతథంగా కొళాయిల ద్వారా అందజేస్తున్నారు. రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పనులు పూర్తి కాలేదు. కోరిమిల్లి గ్రామంలో తాగునీటి చెరువు కలుషితమైంది. ఈ నీటిని తాగలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొరుగు గ్రామమైన కొండేపాడు, మీనవిల్లూరు వెళ్లి తాగునీరు కొని తెచ్చుకొంటున్నారు. చింతపల్లి కూడా చెరువు అడుగంటింది. ప్రధాన మేజర్ గ్రామమైన రావిపాడు చెరువు ఇటీవల తవ్వారు. వేసవికి ముందే చెరువు పూర్తిస్థాయిలో నింపక పోవడం వల్ల అడుగంటింది. కింద ఉన్న నాచు వల్ల నీరు మరింత కలుషితమౌతుంది. పశువులు కూడా గత సంవత్సరంలో ఈ నీటిలో జలకాలాడాయి. ఉమామహేశ్వరంలో తాగునీటి చెరువులో తూడు, గుర్రపుడెక్కతో నిండి ఉంది. ఈ నీరు వేసవికి ముందే తాగేందుకు పనికిరాకుండా పోయింది. ట్యాంక్ వాచర్‌కి జీతాలు ఇవ్వని కారణంగా తాగునీరు సరఫరా సరిగా చేయలేక పోతున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ముదునూరు, ఆకుతీగపాడు చెరువులు అడుగంటాయి, విప్పర్రు గ్రామంలో మూడు పెద్ద చెరువులు ఉన్నా ప్రజలు సక్రమమైన తాగునీరు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు.



కొండేపాడులో కాలుష్య కాసారంగా మారిన నీటిని సంపులోకి ఎక్కిస్తున్న దృశ్యం

కాలువలు వదిలినా..

ప్రస్తుతం కాలువలు వదిలినా పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. ఆ నీరు కలుషితంగా ఉంది. ఇటీవల ఉపాధి పనులలో భాగంగా కాలువలు తూడు తీత పనులలో భాగంగా తొక్కివేయడంతో కుళ్లిన వాసన వస్తోంది. మరో 10 రోజులు గడిస్తేనే గానీ ఆ నీరు ప్రజలకు అక్కరకు రాదు. ఈలోగా అడుగంటిన బురదనీరే ప్రజలు దిక్కు.

ప్రబలుతున్న వ్యాధులు..

ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. డ్రెయినేజీల నీరు మంచినీటిలో కలిసి బురదమయంగా మారాయి. అదే నీటిని క్లోరినైజేషన్ లేకుండా యథాతదంగా అందజేయడం వల్ల ఆ నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మరి కొందరికి చర్మ వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంపై దద్దుర్లు వస్తున్నాయి.

పూర్తికాని పైపులైన్ల పనులు

గత ప్రభుత్వం ప్రజలకు తాగునీరు అందజేసేందుకు జలజీవన్ మిషన్ ఏర్పాటు చేస్తే అధికారుల అలసత్వం వల్ల ప్రజలకు అక్కరకు రావడం లేదు. కొండేపాడులో పైపులైన్లు అస్తవ్యస్తంగా వేయడంపై కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ పాత, కొత్త కాలనీలకు ఎస్సీపేటలో తాగునీరు రావడం లేదు. యనమదుర్రు ఎండిపోవడం వల్ల వాడుకొనేందుకు కూడా నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కానరాని ట్యాంకర్లు

వేసవిలో తాగునీటి తాగునీటి ఎద్దడి రాకుండా ఆయా గ్రామాలలో ట్యాంకర్లు ఏర్పాటు చేసేవారు. కాగా నేడు కూటమి పాలనలో ఆ చర్యలను అటకెక్కించారు. ప్రజాప్రతినిధులు కూడా కనీస అవసరమైన తాగునీరు అందజేసేందుకు ఆసక్తి చూపడం లేదు. వీటిపై కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులకు కూడా సరైన అవగాహన లేదు. గ్రామాలలో పర్యటించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమయ్యారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ చర్యలు కానరావడం లేదని పలువురు చెబుతున్నారు. తక్షణం గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రావిపాడులో కర్రనాచుతో అడుగంటిన చెరువు



రాచర్లలో అడుగంటిన తాగునీటి చెరువు

సాఫీగా సాగుతున్న మెగా డీఎస్సీ పరీక్షలు



వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జరుగుతున్న మెగా డీఎస్సీ పరీక్షలు సాఫీగా జరుగుతున్నాయి. శుక్రవారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఈ పరీక్ష జరిగింది. ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షలకు కలిపి 308 మందికి గాను 299 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు పర్యవేక్షించారు. టెస్టు సెంటర్ అడ్మిన్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్‌లు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



బ్రహ్మకుమారీలచే ప్రొటోకాల్ యోగా కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ యోగా డే పురస్కరించుకుని ఆరా ఫౌండేషన్ కరిబండి రామకృష్ణ గురూజీ ఆధ్వర్యంలో ప్రొటోకాల్ యోగాలో భాగంగా స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. యోగా సాధకులు హాజరై యోగా చేశారు. విశ్వ విద్యాలయం నిర్వాహకురాలు బీకే రమాదేవి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఈతకోట తాతాజీ, గట్టిం మాణిక్యాలరావు, మునిసిపల్ కమీషనర్ ఏసు బాబు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా న్యాయసేవాధికార సంస్థ అదేశాలు మేరకు జూలై 5వ తేదీన తాడేపల్లిగూడెం కోర్టు భవనాలు సముదాయం ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ షేక్ సికిందర్ బాషా పేర్కొన్నారు. అదనపు జిల్లా జడ్జి కోర్టులో శుక్రవారం పోలీస్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సికిందర్ బాషా మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ చేసుకొనే విధంగా చూడాలన్నారు. దీంతో కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. కేసుల రాజీ విషయంలో పోలీసులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలిత కుమారి, కోర్టు పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో డ్రై డే, మలేరియా నివారణపై ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమష్టి కృషితో దోమల వ్యాప్తిని అరికడదామని, దోమ కాటు ఆరోగ్యానికి చేటు అని, కీటకజనిత ప్రదేశాలను తప్పక నిలువరించాలని, ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని స్థానిక సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి. లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో కడకట్ల, యాగర్లపల్లి, బేబి సెంటర్ జంక్షన్‌లలో అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు, వెక్టార్ కంట్రోల్ హైజీన్, క్షేత్రస్థాయి పరిశీలనలు, ర్యాలీ, మలేరియా మాసోత్సవాలపై ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు జరిగాయి. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని చెప్పారు. మలేరియా అంతం మనతోనే సాధ్యమని నినాదాలు చేశారు. వార్డు ఆరోగ్య కార్యకర్తలు ధనలక్ష్మి, చిన్నపాప, జ్యోతి, రాజేశ్వరీ, అంబికా, చంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వాతి, కనకదుర్గ, భవాణి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశాలు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న పిల్లలకు అవగాహన



భిక్షాటన చేస్తున్న పిల్లల తల్లిదండ్రులకు బాలల సంరక్షణ విభాగం సిబ్బంది అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ పరిధిలో భిక్షాటన చేస్తున్న 10 మంది పిల్లలు (బాల, బాలికలు)ను జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో రెస్క్యూ (రక్షించి) చేశారు. బాల, బాలికల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటక్షన్ ఆఫీసర్ రమాదేవి, సోషల్ వర్కర్ లేతపూడి నేహన్య ఆధ్వర్యంలో మరో సోషల్ వర్కర్ జేమ్స్, కౌన్సిలర్ చిట్యూరి సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఈ కౌన్సిలింగ్‌లో పాల్గొన్నారు. పిల్లలను జగ్గన్నపేట సచివాలయం గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎన్‌డీఎల్ శైలజాకు అప్పగించారు. ఎంఈఓ సహాయంతో బాలలందరూ స్కూల్‌కు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అప్పగించారు.

కార్మికసంఘ ఎన్నికలలో ఎఫ్‌ఐటీయూ విజయకేతనం



ప్రత్తిపాడు ట్రిపుల్‌ఎఫ్ ఎన్నికలలో విజయకేతనం ఎగురవేసిన ఎఫ్‌ఐటీయూ సంఘ నాయకులు

పెంటపాడు: ప్రత్తిపాడు ట్రిపుల్‌ఎఫ్ కర్మాగార యూనియన్ ఎన్నికలలో ఎఫ్‌ఐటీయు అనుబంధ కార్మిక సంఘం విజయకేతనం ఎగురవేసింది. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక కర్మాగారంలో సీఐటీయూ, ఎఫ్‌ఐటీయూల మధ్య హోరాహోరీగా జరిగిన ఎన్నికలలో సీఐటీయూపై 12 ఓట్ల మెజార్టీతో ఎఫ్‌ఐటీయూ విజయం సాధించింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎఫ్‌ఐటీయూ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్‌ఎస్‌ఎన్ మూర్తి, అధ్యక్షుడు బి. బాస్కరరావు, ప్రధానకార్యదర్శి సీహెచ్ అప్పనపల్లి, ప్రసాద్ తదితర నాయకులు కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ట్రిపుల్‌ఎఫ్ యాజమాన్యానికి, మద్దతు తెలిపిన రైసుమిల్లు, గోడౌన్ కార్మికులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా యూనిట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, రక్తం దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో మరొకరికి ప్రాణం పోసినట్లేనని తద్వారా ఒక కుటుంబం ఆనందంగా జీవించగలుగుతారన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రమాదం జరిగిన మొదటి గంటలో రక్తం అందజేస్తే విలువైన ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎం.ఎస్.వి శివరామ భద్రరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి, డిప్యూటీ డిఎంహెచ్ఓ బి.భాను నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డీఈవో ఇ.నారాయణ, ఆర్డీవో ఉమామహేశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.లక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్లు కె.రామచంద్రారెడ్డి, ఏసుబాబు, వబిలిశెట్టి శెట్టి కనకరాజు, పదుల సంఖ్యలో రక్తదానం చేసిన దాతలు, రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు, చర్చ్ ఆఫ్ గాడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

ఈనెల 15న తణుకులో అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా సమావేశం



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు

తణుకు అర్బన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 15 వతేదీ తణుకులో నిర్వహించనున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సమావేశానికి కస్టమర్స్, ఏజెంట్స్ అధికసంఖ్యలో తరలిరావాలని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతి రావు కోరారు. శుక్రవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం మోసానికి గురై తీవ్రంగా నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ సహకారంతో గత 10 సంవత్సరాలుగా నిర్విరామంగా ఉద్యమిస్తున్నామన్నారు. ఉద్యమ ఫలితంగా 10 వేలు 20, వేలు రూపాయల లోపు డిపాజిట్ల సొమ్ము పొందడం జరిగిందన్నారు. ఇంకా మిగిలిన బాధితులకు సుమారు 3 వేల 400 కోట్ల రూపాయలు చెల్లించవలసి ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించవలసిన డిపాజిట్ల సొమ్ము కన్నా అగ్రిగోల్డ్ ఆస్తులు నాలుగు రెట్లు అధికంగా ఉన్నాయని ప్రభుత్వం అగ్రి ఆస్తులు స్వాధీనం చేసుకుని బాధితులకు తక్షణ న్యాయం అందజేయాలన్నారు. అగ్రి ఆస్తులు మాఫియా చేతుల్లోకి పోకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికే వందలాది ఎకరాలు కబ్జాదారుల అధీనంలో ఉన్నాయని తక్షణమే కబ్జాదారుల నుంచి భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, అసోసియేషన్ మహిళా కార్యదర్శి వై.నాగలక్ష్మి, నూనె రామశ్రీను, జి. కొండయ్య, పి.శ్రీనువాసు, పి.పాల్ సింగ్, జె.వెంకటసత్యనారాయణ, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు రెడ్‌క్రాస్ అవార్డు



కలెక్టర్ నుంచి రెడ్‌క్రాస్ అవార్డు అందుకుంటున్న గూడెం మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం: గూడెం మునిసిపల్ కమిషనర్‌కు రెడ్ క్రాస్ అవార్డు దక్కింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకున్నారు. జనవరిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అత్యధికంగా రక్తదానం చేయడానికి ప్రోత్సహించినందుకు గాను ఈ అవార్డు ఆయనకు దక్కింది. ఈ సందర్భంగా కమిషనర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి

యలమంచిలి: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితా సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ జాబితాలోని రైతులంతా రైతు సేవా కేంద్రానికి వెళ్లి వేలిముద్ర వేసి ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె కోరారు. ఓటీపీ ద్వారా ఈకేవైసీ చేసే అవకాశం లేదని, కనుక దూరప్రాంతంలో ఉన్న రైతులు కూడా వారి గ్రామానికి చెందిన రైతు సేవా కేంద్రానికి వచ్చి వేలిముద్ర వేయాలని పేర్కొన్నారు. ఏ గ్రామంలో అయితే రైతులకు సొంత భూమి ఉందో ఆ గ్రామ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రంలో మాత్రమే వేలిముద్ర పడుతుందని వివరించారు. ఈ నెల 20 వరకు మాత్రమే గడువుందని ఈలోపు వేలిముద్ర వేయాలని ఆమె కోరారు.

కీటక, నీటిజనిత వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



మలేరియా మాసోత్సవాల్లో మాట్లాడుతున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో కీటక జనిత, నీటి జనిత వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు కప్పల వెంకన్న సెంటర్‌లోని తోటవారి వీధి, ముదిగొండ వారి వీధుల్లో శుక్రవారం నిర్వహించిన మలేరియా మాసోత్సవం జూన్ 2025, ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, అతిసారం, టైఫాయిడ్, జాండిస్ వంటి వ్యాధులు వ్యాపించే పరిస్థితులు ఉంటాయని అన్నారు. వీటన్నింటికి పరిష్కారం ఒక్కటేనని ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా నిరుపయోగ సామగ్రిలో వారం రోజులకు పైబడి స్తబ్దతతో కూడిన నీటినిల్వలు తక్షణమే తొలగించుకోవాలని, వర్షాకాలం అన్ని రోజులు ప్రతీ రోజూ డ్రైడేగా పాటించడం అలవాటు చేసుకోవాలని, చెత్తను డస్ట్ బిన్‌లో మాత్రమే వేయాలని, డ్రెయిన్‌లలో వేయరాదని, చేతులు శుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యనారాయణ, వార్డుహెల్త్ సెక్రెటరీలు టి.లక్ష్మీ కాంతం, ఎన్. స్వర్ణ కుమారి పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సివిల్ జడ్జి సూర్య కిరణ్ శ్రీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పని ప్రదేశాలలో మహిళలపై లైగింక వేధింపులకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్ శ్రీ హెచ్చరించారు. పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు అనే అంశంపై సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం మహిళా పారా లీగ్ వలంటీర్లుకు, కోర్టు మహిళా సిబ్బందికి జడ్జి అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సూర్య కిరణ్‌శ్రీ మాట్లాడుతూ లైగింక వేధింపులు నివారణ, నిషేధం, పరిష్కారం చట్టం-2013లోని సెక్షన్ 4 ప్రకారం అంతర్గత ఫిర్యాదుల కమిటీ రాజ్యాంగం ఉందని, వాటి వివరాలను మహిళలకు అవగాహన కల్పించారు. వేధింపులు ఎదుర్కొన్న మహిళలు భయపడకుండా పై అధికారులకు తెలియజేయాలని సదస్సులో కోరారు. మహిళలు లైగింక వేధింపులకు గురైతే ఉన్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సమాజ సేవలో భారతీయ స్టేట్ బ్యాంక్



ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో రక్తదానం చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారతీయ స్టేట్ బ్యాంక్ కేవలం వ్యాపారం కోసమే కాకుండా సమాజ సేవలో కూడా ముందు ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద రక్తదాన శిబిరం జరిగింది. బ్యాంకు రీజినల్ మేనేజర్ రమేష్ నాయుడు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. 32 మంది బ్లడ్ డోనేషన్ చేశారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎన్.ప్రకాష్, ఎస్‌బీఐ అధికారుల సంఘం జోనల్ కార్యదర్శి జి.జవహర్‌లాల్, హెచ్‌ఆర్ మేనేజర్ నాగేశ్వరరావు, ఏపీటీబీఈఎఫ్ కార్యదర్శి టీవీ సూర్యనారాయణ, యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఎస్.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15న న్యూరో సర్జన్ అలంపురం రాక

పెంటపాడు: ఈనెల 15న అలంపురం వెంకటరమణ ఛారిటీ ఆసుపత్రికి విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్ రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, నరాలకు సంబంధించిన వ్యాధులతో ఇబ్బందులు పడే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.